క్లుప్తంగా

ప్రథమ చికిత్సపై శిక్షణ



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: స్థానిక రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఒక్కరోజు ప్రథమ చికిత్స శిక్షణ శిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రథమ చికిత్సపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. హాజరైన 20 మంది అభ్యర్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. వారికి ఫస్ట్ ఎయిడ్, కృత్రిమ శ్వాస, రక్త స్రావం, ఎముకలు విరగడం, కాలిన గాయాలు, తరలించే పద్ధతులు, పాముకాటు, ఇతర జంతువుల కాట్లు తదితర అంశాలపై కె.సత్యనారాయణ, జి.రమణలు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పారిశుద్ధ్య కార్మికులకు మందులు అందిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో నగరపాలక సంస్థ కార్యాలయంలోని ప్రజారోగ్య విభాగంలో మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పి.సుధీర్ కుమార్ పర్యవేక్షణలో ఉచితంగా వైద్య పరీక్షలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని సూచించారు. మెడికవర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ చైతన్య, డాక్టర్ సోనియా, పేడాడ చంద్రశేఖర్ వైద్య పరీక్షలు నిర్వహించారు.

వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగ అవకాశాలు



గెడ్డ కంచరాంలో అవగాహన కల్పిస్తున్న సతీష్

జి.సిగడాం: వృత్తి విద్యా కోర్సులతో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని వృత్తి విద్యా కోర్సు ఉపాధ్యాయుడు వర్రి సతీష్ అన్నారు. మండలంలోని సర్వేశ్వరపురం, బాతువ, గెడ్డకంచరాం, ఎందువ, జి.సిగడాం గ్రామాల్లో బాలికలకు కుట్లు, అల్లికలపై శిక్షణ శనివారం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా సెలవుల్లో అన్ని గ్రామాల్లో ఉన్న విద్యార్థులకు నైపుణ్యం ఉండేవిధంగా అవగాహన కల్పిస్తున్నామని వెల్లడించారు. విద్యార్థులకు వృత్తి విద్యపై శిక్షణ ఇవ్వడంపై స్థానిక మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ డి.గణేష్ పట్నాయక్ తదితరులు సతీష్‌ను అభినందించారు.

ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళం



నగదును అందజేస్తున్న దాత విజయలక్ష్మి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయ అభివృద్ధికి నగరానికి చెందిన బీహెచ్ విజయలక్ష్మి రూ.లక్ష విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు శనివారం ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు నగదును అందజేశారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక భేటీ



వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు శనివారం కలెక్టరేట్‌లో జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ స్వప్నదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీఎస్టీ రేట్లు కేంద్ర ప్రభుత్వం తగ్గించిన తర్వాత, తగ్గిన ధరలకే వినియోగదారులకు సరుకులు విక్రయించే దిశగా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే వ్యాపారులకు ఉన్న చిన్నచిన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వివిధ అంశాలతో కూడిన వినతిపత్రం అందజేశారు. డిప్యూటీ కమిషనర్‌ను కలిసినవారిలో చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు నటుకుల మోహన్, కావవరపు సీజు, కోరాడ హరగోపాల్ తదితరులు ఉన్నారు.

ఎక్కడికక్కడే..!



80 అడుగుల రోడ్డులోని ఖాళీ స్థలంలో నీరు



డగ్లస్ స్కూల్ సమీపంలోని ఖాళీ స్థలంలో కొన్ని నెలలుగా నిలిచి ఉన్న నీరు



వర్షపు నీటిని మోటార్ ద్వారా తోడిస్తున్న దృశ్యం

- నగరంలో నిలిచిపోతున్న వర్షపు నీరు
- మరోవైపు వేధిస్తున్న మురుగు సమస్య
- శాశ్వత పరిష్కారం చూపని అధికారులు

శ్రీకాకుళం: నగరంలో చిన్నపాటి వర్షం పడినా ఎక్కడికక్కడే నీరు నిలిచిపోతోంది. వీధుల్లో ఉన్న చిన్న రోడ్ల సంగతి అటు ఉంచితే, ప్రధాన రహదారుల్లో సైతం రాకపోకలు సాగించలేని పరిస్థితి నెలకొంటోంది. వర్షపు నీటితో పాటు కాలువల్లోని మురుగు నీరు సైతం రోడ్లపైకి వచ్చి నగర ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పరిస్థితి ఎంత దయనీయంగా ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు తాత్కాలిక చర్యలతోనే కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల కాలువల్లో పూడికలు తీయించినా.. అవి సరైన ఫలితాలు ఇవ్వలేదు. దీంతో పనులు ఏవిధంగా జరిగాయో అర్థం చేసుకోవచ్చు. వర్షం వచ్చిన తర్వాత నిలిచిపోయిన నీటిని తోడించేందుకు రూ.లక్షలు వెచ్చిస్తున్నారు తప్ప.. శాశ్వత పరిష్కారం మాత్రం చూపడం లేదు.

వేధిస్తున్న నిధుల లేమి

ప్రధానంగా నగరపాలక సంస్థకు నిధులు లేమి వేధిస్తోంది. ఉన్న కొద్దిపాటి నిధులను స్థానిక ప్రజాప్రతినిధులు, జిల్లాకు చెందిన నాయకులు రథసప్తమి రోజున రాష్ట్రస్థాయి పండుగ అంటూ ఖర్చు చేయించేశారు. రథసప్తమిని రాష్ట్రస్థాయి పండుగగా ప్రకటించిన ప్రభుత్వం నిధులను మాత్రం విడుదల చేయలేదు. దీంతో ఉన్న నిధులన్నీ ఆ రోజున సౌకర్యాలు కల్పించేందుకు, నగర సుందరీకరణ కోసం ఖర్చు చేసేశారు. దీనివల్ల ప్రజలకు సరైన సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. ఇదిలా ఉంటే వర్షపు నీరు నెలల తరబడి ఖాళీ స్థలాల్లో నిల్వ ఉండిపోవడం వలన దోమల బెడద తీవ్రంగా ఉంది. అలాగే ఆ ప్రాంతం నుంచి వెళ్లేవారికి దుర్గంధం వెదజల్లుతూ ఆరోగ్యంపై ప్రభావం చూపుతోంది. పరిస్థితి ఇలా ఉన్నా నగరపాలకు సంస్థ అధికారులు ఖాళీ స్థలాల యజమానులపై ఎటువంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. అందువలన ఇప్పటికైనా వర్షపు నీరు, మురుగు నీరు వెళ్లేందుకు శాశ్వత పరిష్కారాన్ని చూపాలని నగర ప్రజలు కోరుతున్నారు.

మిర్తిబట్టి ప్రధాన సమస్య



వర్షపు నీరు, మురుగు నీరు ఎక్కడికక్కడే నిలిచిపోవడానికి మిర్తిబట్టి ప్రధాన సమస్యగా తయారైంది. ఈ కాలువ నగరం నుంచి నీటిని తీసుకెళ్లడానికి ప్రధానంగా ఉంది. అయితే దీనిని పలువురు ఆక్రమించుకోవడం వల్ల ఇబ్బందులు తప్పడం లేదు. ఖాళీ స్థలాల యజమానులకు ప్రణాళిక విభాగం నోటీసులు జారీ చేస్తుంది. ఆరోగ్య నగర నిర్మాణానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

– డాక్టర్ సుధీర్ కుమార్, హెల్త్ ఆఫీసర్, శ్రీకాకుళం నగరపాలక సంస్థ

నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర వీధుల్లో వర్షపు నీరు నిలిచిపోకుండా, కాలువల్లో ఎటువంటి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. నగరంలోని పలు ప్రాంతాల్లో కలెక్టర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రధానంగా ఏడు రోడ్ల కూడలి, పాత బ్రిడ్జి, ముత్యాలమ్మ మార్కెట్, సత్యానగర్ ప్రాంతాల్లో స్వయంగా పర్యటించి రహదారులు, కాలువల పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువలపై ఎక్కడైనా నిర్మాణాలు చేసి ఆటంకాలు కలిగిస్తే వాటిని తొలగించాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో రోడ్ల ఇరువైపులా కాలువలను పునరుద్ధరించాలన్నారు. ఆయనతో పాటు మున్సిపల్ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు, సహాయ ప్రణాళికాధికారులు వేంకటేశ్వరరావు, జానకి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ సుధీర్ తదితరులు ఉన్నారు.



నగరంలో కాలువలు పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఉపకరణాలకు 120 మంది ఎంపిక



మాట్లాడుతున్న జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ గోవిందరావు



కార్యక్రమానికి విచ్చేసిన దివ్యాంగులు

రణస్థలం: స్థానిక జెడ్పీహెచ్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన దివ్యాంగుల ఉపకరణాల ఎంపిక పరీక్షకు 120 మంది హాజరయ్యారని సమగ్ర శిక్ష ఏపీసీ ఎస్.శశిభూషణ్‌రావు తెలిపారు. 6 నుంచి 18 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న దివ్యాంగులకు సమగ్ర శిక్ష ఆర్థిక సాయంతో ఉపకరణాలు అందజేయనున్నారు. శిబిరంలో గుర్తించిన విద్యార్థులకు నాణ్యమైన వీల్ చైర్స్, ట్రై సైకిల్స్, వినికిడి యంత్రం, బ్రెయిలీ కిట్, ఎం.ఆర్ కిట్ వంటి ఉపకరణాలు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్య కో–ఆర్డినేటర్ బి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం హైదరాబాదుకు చెందిన విశ్వేశ్వరరావు కుటుంబ సభ్యులు రూ.లక్ష విరాళంగా సమర్పించారు. ఈ మేరకు శనివారం ఉదయం ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణకు విరాళ చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు ఇప్పిలి ఫణీంద్రశర్మ తదితరులు పాల్గొన్నారు.



చెక్ అందజేస్తున్న దాతలు

వారసత్వ సంపదగా గుర్తించేందుకు కృషి

గార: జిల్లా ప్రాముఖ్యమైన శాలిహుండం బౌద్ధారామాలను ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తించేందుకు ప్రభుత్వపరంగా కృషి చేస్తామని జిల్లా పర్యాటకశాఖాధికారి ఎన్.నారాయణరావు తెలిపారు. శాలిహుండంలో శనివారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్, కేంద్రమంత్రి ద్వారా ప్రతిపాదనలు పంపడం జరుగుతుందన్నారు. బౌద్ధారామాల విశిష్టతను తెలియజేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వందల ఏళ్ల నాటి కట్టడాలు సంరక్షణకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎం.చక్రవర్తి, ఎంపీడీవో ఎ.రఘు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి



సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం పాతబస్టాండ్: స్థానిక రెవెన్యూ భవనంలో జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం ఆధ్వర్యంలో రెవెన్యూ టైగర్ కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ సర్వీసుల సంఘం అధ్యక్షుడు కె.శ్రీరాములు తోట సుధాకర్ ప్రసాద్ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి చేసిన సేవలను కొనియాడారు. అంతకుముందు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి బీవీవీఎస్ రాజు, ట్రెజరర్ మురళీధర్ నాయక్, ఉపాధ్యక్షులు డి.పద్మావతి, బి.గోపాల్, జాయింట్ సెక్రటరీ జి.రామలింగం, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రామ్‌జీ, సెక్రటరీ జి.డిల్లేశ్వరరావు, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు జి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు



సీసీ కెమెరాలు పరిశీలిస్తున్న ఎస్‌ఐ గంగరాజు తదితరులు

గార: మండల పరిధిలోని జొన్నలపాడు కాలనీ జంక్షన్ వద్ద గ్రామస్తుల సహకారంతో పోలీసులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. వాటిని ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు శనివారం పరిశీలించారు. నేర నియంత్రణకు ఉపయోగపడతాయన్నారు. జొన్నలపాడు గ్రామస్తులు మాదిరిగా అన్ని గ్రామాల్లో గ్రామ పెద్దలు, యువత సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలు, దొంగతనాలు వంటి సమయాల్లో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రుప్ప శ్రీనివాసరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకే మొగ్గు



రణస్థలంలో వేసిన మొక్కజొన్న పంట

- గిట్టుబాటు ధర లభిస్తుండడంతో ఆసక్తి

రణస్థలం: వ్యవసాయంలో పెట్టుబడులు అమాంతం పెరిగిపోయాయి. ఏ పంట వేసినా పెట్టిన ఖర్చుకు తగినట్టు ఆశించిన దిగుబడులు రావట్లేదు. కొన్నిసార్లు ప్రకృతి సహకరించకపోవడం, చీడపీడల బెడద ఎక్కువగా ఉండడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోంది. దీంతో పలువురు రైతులు వాణిజ్య పంట మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం ఏటేటా పెరుగుతోంది. అన్ని కాలాల్లోనూ ఈ పంట సాగుకు అనుకూలంగా ఉండడం, గిట్టుబాటు ధర కూడా లభిస్తుండడంతో ఆసక్తి చూపుతున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారులు (ఫైల్)

తక్కువ పెట్టుబడి.. అధిక ఆదాయం

జిల్లాలోని ఎచ్చెర్ల నియోజకవర్గంతో పాటు గార, నరసన్నపేట, జలుమూరు, సరుబుజ్జిలి, పోలాకి, పాతపట్నం, బూర్జ మండలాల్లో మొక్కజొన్న సాగు ఎక్కువగా జరుగుతోంది. గతంలో పల్లపు భూముల్లో వరి పండించేవారు. ప్రస్తుతం మెట్ట, పల్లపు భూముల్లో ఖరీఫ్‌తో పాటు రబీలోనూ మొక్కజొన్నే అధికంగా వేస్తున్నారు. ధరల్లో హెచ్చుతగ్గులు ఉన్నా.. పెట్టుబడి చేతికి కచ్చితంగా వచ్చేస్తుందనే నమ్మకం కలగడంతో ముందుకొస్తున్నారు. ఈ ఏడాది క్వింటా ధర రూ.2,200 పలుకుతోంది. అయితే రెండేళ్లగా కత్తెర పురుగు ప్రభావం ఎక్కువగా ఉండడం, ఒకే పంటను నిరంతరం వేస్తుండడంతో దిగుబడులు తగ్గుతున్నాయి. అలాగే రెండేళ్లుగా వర్షాభావ పరిస్థితులతో చెరువులు నిండలేదు. తోటపల్లి కాలువ ద్వారా నీరు అందే పరిస్థితి లేకపోవడంతో సాగు విస్తీర్ణంలో హెచ్చు తగ్గులు కనిపిస్తున్నాయి. ఇలా అన్ని కాలాల్లో ఒకే పంట వేయడం కూడా సరికాదని, మారుస్తూ ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

రైతులు ఆసక్తి చూపుతున్నారు

రైతులు మొక్కజొన్న పంటపై అధికంగా ఆసక్తి చూపుతున్నారు. అలాగే పంట మార్పిడి విధానం అనుసరిస్తే దిగుబడులు బాగుంటాయి. దీనివలన చీడ పీడల బెడద తగ్గి దిగుబడులు పెరుగుతాయి. మొక్కజొన్నకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు సాగు రైతులకు అనుకూలంగా ఉండడంతో ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు.

– వి.శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ ఏడీఏ, రణస్థలం

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచకాలు, అన్యాయాలు, అక్రమాలు ఎక్కువైపోయాయని, వాటిని నియంత్రించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని వైఎస్సార్‌సీపీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు అన్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు డిజిటల్ బుక్ అండగా ఉంటుందన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం నియోజకవర్గ నాయకుల డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్‌ను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్యకర్తలకు కూటమి నేతల వలన ఎటువంటి ఇబ్బంది వచ్చినా ఈ బుక్‌లో పొందుపరచాలని సూచించారు. రానున్న ఎన్నికల్లో విజయం సాధించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పోలినాటి వెలమ కుల రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, కళింగ వైశ్యకుల రాష్ట్ర అధ్యక్షుడు అంధవరపు సూరిబాబు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల పురుషోత్తం, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మార్పు పృథ్వీ, పార్టీ సంయుక్త కార్యదర్శి ఎన్ని ధనుంజయరావు, నగర అధ్యక్షుడు సాధు వైకుంఠరావు, చిట్టి జనార్దనరావు, గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు రౌతు శంకరరావు, ఎంఏ బేగ్, వైవీ శ్రీధర్, సనపల నారాయణరావు, యజ్జల గురుమూర్తి, బొడ్డేపల్లి పద్మజ, తంగుడు నాగేశ్వరరావు, గుండ హరీష్, సీహెచ్ భాస్కర్, రుప్ప అప్పలసూరి, సీపాన రామారావు, కనపల తేజ తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు సరికాదు

జి.సిగడాం: అసెంబ్లీలో సినీ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని సీనియర్ న్యాయవాది, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి అన్నారు. మండలంలోని దవళపేట గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశం మాట్లాడారు. కూటమి ప్రభుత్వం రైతుకు సకాలంలో ఎరువులను పంపిణీ చేయడంలో విఫలమైందని మండిపడ్డారు. అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించాలని సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నాయకుడు కంచరాన రమణారావు, పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ పేడాడ శ్యామలరావు, పేడాడ నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీరామమూర్తి

న్యాయవాదుల జీవిత బీమా పెంపు

శ్రీకాకుళం పాతబస్టాండ్: న్యాయవాదుల జీవిత బీమాను రూ.9 లక్షలకు పెంచుతూ రాష్ట్ర న్యాయవాదుల బార్ తీసుకున్న నిర్ణయంపై జిల్లా బార్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు శనివారం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బార్ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయాలపై చర్చించారు. ఇప్పటివరకు న్యాయవాది జీవిత బీమా (రాష్ట్ర వెల్ఫేర్ ఫండ్ నుంచి అందజేసే పరిహారం) రూ.6 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. అదేవిధంగా న్యాయవాది ఆరోగ్య ప్రయోజనాల రీత్యా ఇచ్చే ఆర్థిక సాయం రూ.1,50,000ల నుంచి రూ.2,50,000లకు పెంచడం జరిగింది. పెంచిన సహాయాలు అక్టోబర్ 1వ తేదీ నుంచి అమల్లో రానున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు గేదెల వాసుదేవరావు తెలియజేసినట్లు వివరించారు. ఆర్థిక సాయం పెంపుదలపై బార్ కార్యదర్శి పిట్టా దామోదరరావు, లేడీ రిప్రజెంటేటివ్ గురుగుబెల్లి వనజాక్షి, న్యాయవాదులు కృష్ణచంద్, పొన్నాడ వెంకట రమణరావు, ఎన్ని సూర్యారావు, ఆరంగి లక్ష్మీపతి, ఆగూరి ఉమామహేశ్వరరావు, కె.సుభాష్, కంచరాన నాగభూషణరావు, బీఎస్ చలం, బెజ్జిపురపు ఫల్గుణరావు, గొర్ల రామారావు, అన్నెపు భువనేశ్వరరావు, సనపల హరి, మామిడి క్రాంతి, సరళ కుమారి, ఉషారాణి ధన్యవాదాలు తెలిపారు.



మహాలక్ష్మీగా విజయదుర్గ



మొండేటివీధిలో మహాలక్ష్మిగా లలితాదేవి



గుడివీధిలో రాజరాజేశ్వరీగా దర్శనం

రావమ్మా.. మహాలక్ష్మి..!

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆరో రోజైన శనివారం అమ్మవారు వివిధ అలంకరణల్లో దర్శనమివ్వగా.. భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పలుచోట్ల మహిళలు పెద్ద ఎత్తున కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

– శ్రీకాకుళం కల్చరల్



రాజరాజేశ్వరీ పీఠంలో అమ్మవారికి అలంకరణ



ఉమారుద్ర కోటేశ్వరాలయంలో హోమం చేస్తున్న దృశ్యం



మొండేటివీధిలో మహాచండీ హోమం చేస్తున్న దృశ్యం



హౌసింగ్ బోర్డు కాలనీలో దుర్గామాతకు పూజలు



చిన్మయమిషన్ ఆధ్వర్యంలో కుమారి పూజలు

కిక్కిరిసిన కాంప్లెక్స్

- కళాశాలలకు సెలవులు ఇవ్వడంతో ఇళ్లకు బయల్దేరిన విద్యార్థులు



కాంప్లెక్స్ ఆవరణలో ప్రయాణికులు

శ్రీకాకుళం అర్బన్: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ శనివారం ప్రయాణికులతో కిక్కిరిసి కనిపించింది. దసరా పండగ నేపథ్యంలో కళాశాలల విద్యార్థులకు సెలవులు మంజూరు చేయడంతో, వారి స్వగృహాలకు తరలివెళ్లే విద్యార్థులతో రద్దీమయంగా మారింది. అయితే సకాలంలో బస్సులు లేకపోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి ఏర్పడింది. అలాగే కాంప్లెక్స్‌కు వచ్చిన బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోవడం కనిపించింది. అదేవిధంగా ట్రిపుల్ ఐటీ, ఎంబీబీఎస్, పాలిటెక్నికల్, నర్సింగ్ తదితర కళాశాలలకు సెలవులు మంజూరు చేయడంతో దూరప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు విశాఖపట్టణం వెళ్లేందుకు కాంప్లెక్స్‌కు చేరుకున్నారు. సకాలంలో బస్సులు లేకపోవడంతో పల్లె వెలుగు బస్సులే నాన్‌స్టాప్ బస్సులుగా ఆర్టీసీ అధికారులు నడిపి రద్దీని క్రమబద్ధీకరించారు.



బస్సులు ఎక్కేందుకు ఎగబడుతున్న ప్రయాణికులు



పల్లె వెలుగులే నాన్‌స్టాప్‌లుగా...